

ఏదీ.. ఏటా రూ.20 వేలు..

రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తుంది. ఉద్యోగం పొందే వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం.

మే 6న ఈనాడు ప్రతికలో ప్రచురితమైన ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి మాటలు..

పెట్టుబడి సాయం అందేదెప్పుడు



రైతులకు విత్తనం నుంచి పంట అమ్మకాల వరకు అన్ని విధాలా అండగా ఉంటామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు దాటినా పెట్టిబడిసాయం అందలేదు. విత్తనాలు. ఎరువులు కొనుగోలుకు. కోతలకు ఇలా అన్ని స్థాయిల్లోనూ రైతులను ఆదుకోవాలి.

– బార్ల వేణుగోపాలరావు, రైతు, చెన్నాపురం, నరసన్నపేట



వరాలు.. కురిపించేదెప్పుడో..

సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాలకు వరాలు. 19 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తాం. వారు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించొచ్చు.

మే 6న ఈనాడు పత్రికలో ప్రచురితమైన ఎమ్మెల్యే కూన రవికుమార్ హామీలు

ఉచిత బస్సు ఎక్కడ?



ప్రతి మహిళలకూ ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తామని ఎన్నికల ముందుర ఊదరగొట్టిన హామీలతో కూటమి ప్రభుత్వం ఓట్లు వేయించుకుంది. పథకాన్ని ఆచరణలో పెట్టలేనప్పుడు హామీలు ఎందుకు ఇచ్చారు. అధికారం లోకి వచ్చాక శ్వేత పత్రాలతో కాలయాపన చేస్తున్నారే.. తప్ప హామీలపై దృష్టి సారించడంలేదు. ఇది ప్రజలను మోసగించడమే అవుతుంది.

– ఎం.భద్రమ్మ, రొట్టవలస, సరుబుజ్జిలి



మూడు వేలు 'భృతి' ఏది గోవిందా...

నిరుద్యోగులకు నెలనెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం. పరిశ్రమల అవసరాలకు తగినట్లు నైపుణ్య శిక్షణ అందిస్తాం.

మే 5న ఈనాడు పత్రికలో ప్రచురితమైన ఎమ్మెల్యే మామిడి గోవింద రావు హామీలు


నిరుద్యోగ భృతి ఏమైంది..?



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారం లోకి వచ్చి 100 రోజులైనా పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు కల్పించండి. లేకపోతే నిరుద్యోగ భృతి రూ.3 వేలు కచ్చితంగా చెప్పిన హామీ మేరకు ఇవ్వాల్సిందే. లేక పోతే నిరుద్యోగులు తిరగబడతారు.

– గంట్యాడ రామకృష్ణ, ఉప్పరవీధి, పాతపట్నం

సూపర్ 6 మోసపోవడం ఫిక్స్



- సూపర్ సిక్స్‌పై నీలినీడలు
- వంద రోజుల పాలన పూర్తవుతున్నా అమలు కాని హామీలు

ఎన్డీఏ కూటమిలో భాగమైన టీడీపీ, జనసేన నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు ఎన్నికల ముందు అనేక బహిరంగ సభల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలయ్యేది ఎప్పుడు..? అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి 100 రోజులు పూర్తి కావస్తోంది. అధ్యయనాల పేరిట కాలయాపన చేస్తుండటంతో 'సూపర్ సిక్స్' మాటేమిటని అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, తల్లికి వందనంగా రూ.15వేలు, నిరుద్యోగ భృతి రూ.3,000, ఇంటికో ఉద్యోగం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెల రూ.1500 చొప్పున సాయం ఎప్పుడు ఇస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

మూడు సిలిండర్లు ఏమయ్యాయి?



ప్రతి ఇంటికీ కచ్చితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి రాష్ట్ర నేతలతో పాటు స్థానిక అభ్యర్థులు ఈ అంశంపై ప్రచారం చేశారు. ఇప్పుడేమో దీని గురించే మరిచిపోయారు. పేదలందరం గ్యాస్ సిలిండర్లు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నాం. అధికారంలోకి వచ్చాక ఇంతమోసం చేస్తారని అనుకోలేదు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదు.

– పాలక దమయంతి, బొడ్లపాడు గ్రామం, బూర్జ మండలం

మహిళలకు రూ.1500 ఇవ్వాల్సిందే..



మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ఎన్నికల ప్రచారంలో హోరెత్తించారు. ఎన్నికల వేళ ప్రతి సభ, సమావేశాలలో కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ ఉపన్యాసాలు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేకుండా పోతుంది. హామీలు ఇచ్చాక మరచిపోతే ఎలా.. నాతో పాటు మహిళలందరూ రూ.1500 ఎప్పుడిస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదు.

– పందిరెడ్డి జ్ఞానేశ్వరి, మాకివలస, సారవకోట మండలం


మహిళకు నెలకు రూ.1500 సాయం


నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)	పొందాల్సిన లబ్ధి (కోట్లలో)
నరసన్నపేట	98,869	రూ.14.83
పాతపట్నం	65,306	రూ.9.79
ఆమదాలవలస	56,350	రూ.8.45



అన్నదాతా సుఖీభవా

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)	పొందాల్సిన లబ్ధి (కోట్లలో)
నరసన్నపేట	39,000	రూ.78.00
పాతపట్నం	42,560	రూ.85.12
ఆమదాలవలస	40,323	రూ.80.64





తల్లికి వందనం

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)	పొందాల్సిన లబ్ధి (కోట్లలో)
నరసన్నపేట	38,319	రూ.57.47
పాతపట్నం	30,611	రూ.45.91
ఆమదాలవలస	30,797	రూ.46.19



నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)	పొందాల్సిన లబ్ధి (కోట్లలో)
నరసన్నపేట	80,687	రూ.24.20
పాతపట్నం	1,57,726	రూ.47.31
ఆమదాలవలస	95,523	రూ.28.05





గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)
నరసన్నపేట	1,11,315
పాతపట్నం	1,50,679
ఆమదాలవలస	1,04,473



మహిళలకు ఉచిత బస్సు

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)
నరసన్నపేట	80,796
పాతపట్నం	81,085
ఆమదాలవలస	79,539

బాబు.. ఏదీ జవాబు?

తల్లికి వందనంపై ఇంత మోసమా!



టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా తల్లికి వందనం అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కుటుంబంలో ఎంతమంది చదువుకున్నా అందరికీ ప్రతిఏటా ఒక్కో పిల్లాడికి రూ.15వేలు ఇస్తామని నమ్మబలికారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల కావస్తున్నా ఇంతవరకు ఆ ఊసే ఎత్తడంలేదు. ప్రభుత్వం ఇంత నమ్మించి మోసం చేస్తుందని ఊహించలేదు. మరి ఇస్తారని గ్యారంటీ కూడా మాకులేదు.

– కె.శైలజ, ఎంఎస్‌పురం, సరుబుజ్జిలి

ఇచ్చిన హామీ నెరవేర్చాలి



ఏడాదికి ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారం వచ్చిన తరువాత విస్మరించారు. ఈ అంశంపై టీడీపీ నాయకులు ఎంతగానో ప్రచారం చేశారు. అధికారం వచ్చిన తరువాత ఇచ్చిన హామీ మరిచారు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదు. మహిళలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

– కె.మంజులత, శ్రీముఖలింగం, జలుమూరు మండలం

పెట్టుబడి సాయం ఇంకెప్పుడిస్తారు



ఖరీఫ్ ప్రారంభం నాటికి పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నగదు నేరుగా అకౌంట్లోకి వచ్చేది. మూడు నెలలు దాటిపోతున్నా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇచ్చిన హామీకి అతీగతీలేదు. అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20వేలు ఇస్తానన్న సీఎం చంద్రబాబు తక్షణమే నిధులు విడుదల చేయాలి. ఇది ముమ్మాటికీ రైతుల నమ్మకంతో ఆడుకోవటమే. అన్నదాతలకు అన్యాయం చేయటం ప్రభుత్వానికి మంచిదికాదు.

– గేదెల నాగేశ్వరరావు, రైతు, పాలవలస, పోలాకి మండలం

జగన్ చెప్పారు.. చేశారు..

సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా అందింది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా అందింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటం, వర్షాల కారణంగా పంటలకు నష్టం జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం పెట్టుబడి సహాయం ప్రస్తావన చేయటం లేదు. ఏడాదికి రూ.20 వేలు సహాయం ఇస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేశారు. ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఉంది.

– కొల్ల కృష్ణ, రైతు, దొంకలబడవంజ, ఎల్.ఎన్.పేట

రైతు భరోసా

నియోజకవర్గం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (కోట్లలో)
నరసన్నపేట	37,305	రూ.50.36
పాతపట్నం	40,865	రూ.55.16
ఆమదాలవలస	38,628	రూ.52.15



అమ్మ ఒడి సక్రమంగా వచ్చేది..



ఒకటో తరగతి పిల్లాడు నుంచి ఇంటర్ చదువుకున్న విద్యార్థుల వరకు అమ్మ ఒడి పథకం జగనన్న ప్రభుత్వం అమలు చేసింది. జూన్ ప్రారంభంలోనే అమ్మ ఒడి డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ అయ్యేవి. కరోనా సమయంలో కూడా అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. ఇవి తల్లులకు ఎంతగానో ఉపయోగపడేవి. పిల్లలు స్కూల్‌కు వెళ్లే సమయానికి అవసరమైన వస్తువులు, దుస్తులు ఇలా అన్నింటికీ ఉపయోగపడేవి. విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు కూడా అమలు చేశారు.

– పట్నాన లక్ష్మి, జగనన్న కాలనీ, గడ్డేయ్యపేట, జమ్ము, నరసన్నపేట మండలం

అమ్మఒడి

నియోజకవర్గం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (కోట్లలో)
నరసన్నపేట	30,120	రూ.45.17
పాతపట్నం	22,411	రూ.30.25
ఆమదాలవలస	22,597	రూ.29.37





క్లుప్తంగా

పీఎం సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆమదాలవలస: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకునే సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో వార్డు అడ్మిన్, ఎమినిటీ కార్యదర్శులతో బుధవారం సమీక్షించారు. సొంత ఇళ్లు కలిగినవారు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకొవటం వల్ల కలిగే లాభాలను ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎలక్ట్రికల్ ఏఈ జి.రామారావు, మునిసిపల్ ఏఈ కె.అప్పలనాయుడు, ఇన్‌చార్జి మేనేజర్ కె.ఎన్.పి.చక్రవర్తి, ఆర్ఐ టి.గోవిందరావు పాల్గొన్నారు.

కుంగిన సిందూరు రోడ్డు



కోతకు గురైన రోడ్డు

పొందూరు: మండలంలోని రెల్లిగెడ్డకు వస్తున్న వరదలకు సింగూరు రోడ్డు ప్రతీ ఏడాది కోతకు గురవుతుంది. ఈ ఏడాది పది రోజుల క్రితం వచ్చిన వరదలకు సింగూరు గ్రామ సమీపంలోని రోడ్డు సుమారు 8 అడుగుల మేర రోడ్డు కుంగింది. రోడ్డు జారి కాలువలో ఎప్పుడు పడిపోతుందోనని ప్రయాణికులు హడలిపోతున్నారు. సమస్యను సింగూరు గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు తెలియజేశారు. రోడ్డును పరిశీలించాలని పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. పంచాయతీ రాజ్ డీఈ చంద్రశేఖర్, ఏఈ సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈ రమణ, ఏఈ రవి తదితరులు రోడ్డును బుధవారం పరిశీలించారు.

ఉపాధి అక్రమాలపై నిలదీత

ఆమదాలవలస:

మండలం వ్యాప్తంగా 2023- 24లో ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనుల్లో జరిగిన అక్రమాలపై బుధవారం ఉపాధి హామీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ప్రజా వేదికలో అధికారులను ప్రజాప్రతినిధులు, నాయకులు, వేతనాదారులు నిలదీశారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు నమోదు చేసిన వివరాలను చదివి వినిపిస్తున్న సమయంలో వంజంగి గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని ఏపీడీ లోకేశ్వరరావు, జిల్లా అధికారి స్వరూప రాణి, విజిలెన్స్ అధికారి లవరాజు దృష్టికి మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు తీసుకువచ్చారు. గాజులకొల్లివలస పంచాయతీలో దేశెట్టి బాలగోపి అనే వ్యక్తి జొన్నవలస 30 పడకల ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన పేరుపై 100 రోజులు పనిచేసినట్లు మస్తర్లు ఎలా వేశారని ఆ గ్రామస్తులు ప్రశ్నించారు. గ్రామ పరిధిలో 250 మొక్కలు నాటితే.. ప్రస్తుతం 19 మొక్కలే ఉన్నాయని తనిఖీ బృందం చెప్పడంలో ఆంతర్యం ఏమిటన్నారు. నెల్లిపర్తి గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగాయని ఆ గ్రామస్తులు ప్రశ్నించారు. క్షేత్ర సహాయకుడు నుంచి నిధులు రికవరీతోపాటు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో శాంతించారు. కలివరం పంచాయతీలో 95 ఏళ్ల తంగి రాజారావు పేరిట క్షేత్ర సహాయకుడు మస్తర్లు వేసినట్లు సామాజిక బృందం సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, టీడీపీ నాయకులు నూకరాజు, సనపల ఢిల్లీశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్‌రావు, ఏపీఓ లక్ష్మీనరసమ్మ, ఎస్ఆర్పీ పున్నపునాయుడు, ఈఓపీఆర్డీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల జైలు శిక్ష

- రూ.16 వేల జరిమానా

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లికి చెందిన రావాడ లచ్చు అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.16 వేల జరిమానాను శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్ బుధవారం విధించారని నరసన్నపేట ఎస్ఐ సి.హెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన మచ్చ గణేష్ 2021 జులై 30న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ సత్యనారాయణ ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేశారు. డీఎస్పీ బాలరాజు దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో విచారణ అనంతరం కులం పేరుతో గణేష్‌ను లచ్చు దూషించినట్లు రుజువుకావడంతో ఈ మేరకు శిక్ష, జరిమానా విధించారు.

మండలానికి 30 గోకులాల మంజూరు

ఎల్.ఎన్.పేట: మండలంలో ఆసక్తి ఉన్న రైతులు గోకులాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పశుసంవర్ధక శాఖ ఏడీఏ నారాయణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయానికి బుధవారం వచ్చిన ఆయన లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణంపై ఎంపీడీఓ కాశీప్రసాద్, పశువైద్యాధికారి కవితలతో మాట్లాడారు. ఎల్.ఎన్.పేట మండలానికి 30 గోకులాలు మంజూరయ్యాయన్నారు. వీటిలో 15 శాతం ఎస్సీ, 7 శాతం ఎస్టీ లబ్ధిదారులకు కేటాయించాలని వివరించారు. రెండు పశువులు ఉంటే రూ.1,15,000లు, నాలుగు పశువులు ఉంటే రూ.1,85,000, ఆరు పశువులు ఉంటే రూ.2,30,000 నిధులు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. వీటిలో లబ్ధిదారుని వాటాగా పది శాతం చెల్లించాలన్నారు. మిగిలిన డబ్బులు ఉపాధి హామీ పథకం నుంచి చెల్లించటం జరుగుతుందన్నారు. గొర్రెలు, మేకలు ఉన్న వారు కూడా షెడ్లు నిర్మించుకోవచ్చన్నారు. 20 జీవాలు ఉంటే రూ.1,30,000, 50 జీవాలు ఉంటే రూ.2,30,000, కోళ్ల ఫారం నిర్మాణం కోసం వంద కోళ్లు ఉంటే రూ.87,000, 200 కోళ్లు ఉంటే రూ.1,32,000 నిధులు మంజూరవుతాయన్నారు. వీటి కోసం లబ్ధిదారుని వాటాగా 30 శాతం చెల్లించాలన్నారు.

అందని వైద్య సేవలు

తమ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పని చేస్తున్న డాక్టర్లు విధులను బహిష్కరించారు. ఇన్ సర్వీస్ వైద్యులకు పీజీ విద్యలో సీట్లు కోటా తగ్గించటంతో వీరు మూడు రోజులుగా విధులకు హాజరు కాకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. పలు పీహెచ్‌సీలను 'సాక్షి' బుధవారం సందర్శించగా.. ఈ విషయం వెలుగు చూసింది. డాక్టర్లు సమ్మెలో ఉండగా కిందిస్థాయి సిబ్బంది విధులకు హాజరవుతున్నారు. రోగులకు వారి నుంచి సరైన వైద్య సేవలు అందడం లేదు. రోగులు కూడా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: అక్కులపేట పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న బెడ్‌లు



నరసన్నపేట: మాకివలస వైద్యులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న సీట్లు

సంక్షిప్తంగా...

వినాయక లడ్డూ రూ.99 వేలు

పాతపట్నం: మండలంలోని అచ్చుతాపురం గ్రామంలో వినాయకుని లడ్డూ వేలం పాట బుధవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన మజ్జి తిరుపతిరావు రూ.99,200లకు సొంతం చేసుకున్నారు. పాతపట్నం కోటగుడ్డి కాలనీలోని వినాయకుని లడ్డూ వేలం పాటలో అదే కాలనీకి చెందిన ఆదాడ అప్పలనాయుడు రూ.78 వేలకు దక్కించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సవిరిగాన ప్రదీప్, మజ్జి వరదరాజు, భక్తులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నరసన్నపేట: స్థానిక జగన్నాథపురం గ్రామానికి చెందిన యువతి కనిపించడం లేదని నరసన్నపేట పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. స్థానిక వస్త్ర షోరూమ్‌లో పనిచేస్తున్న తన కుమార్తె ఆదివారం పెద్దపేటలో అన్నదానానికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ కనిపించలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సి.హెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు.

సర్పంచ్‌పై ఫిర్యాదు

కొత్తూరు: మండలంలోని మెట్టూరుబిట్-1 ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ అడపాక శంకరరావుపై అదే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు బుధవారం స్థానిక ఎంపీడీఓ పావని, ఈఓపీఆర్డీ బసవ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. కాలనీలోని రోడ్డు నంబర్ 2, 3, 6లలో కల్వర్టులు నిర్మించకుండా బిల్లులు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కల్వర్టులు నిర్మించకపోవడంతో వర్షంనీరు కాలనీలోకి చొరబడటంతో పలువురు జ్వరాలు బారిన పడినట్లు తెలిపారు. పంచాయతీలోని పలు అభివృద్ధి పనుల్లో సర్పంచ్ అవకతవకులకు పాల్పడ్డారన్నారు. సర్పంచ్‌పై విచారణ చేపట్టాలన్నారు.

కంటి ఆపరేషన్లకు 85 మంది ఎంపిక

బూర్జ: మండంలంలోని బూర్జ, గుత్తావల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఇటీవల తనిఖీలు నిర్వహించారు. 85 మందిని శస్త్ర చికిత్సల కోసం శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్‌కు బుధవారం తరలించారు. ఆప్తాలమిక్ అధికారి డి.ప్రతాప్, రెండు పీహెచ్‌సీల సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డులో దిగబడిన వాహనాలు



రోడ్డులో దిగబడిన లారీ, ట్రాలీ

సరుబుజ్జిలి: అలికాం-బత్తిలి రహదారిలో సరుబుజ్జిలి సమీపంలోని పోలీస్ క్వార్టర్స్, పెట్రోల్ బంకు వద్ద లారీ, ట్రాలీ మంగళవారం అర్ధ రాత్రి దిగబడినట్లు స్థానికులు తెలిపారు. ట్రాఫిక్ జామ్ కావడంతో స్థానికుల సహకారంతో బుధవారం జేసీబీలను పెట్టి వాహనాలను బయటకు తీశారు.

రైతు అవార్డు పట్ల హర్షం

హిరమండలం: గ్రీన్ బర్డ్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి జాతీయ స్థాయిలో అవార్డు రావడంతో జిల్లాకు కీర్తి ప్రతిష్టలు పెరిగాయని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు రైతు జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ఆధారిత ఉత్పత్తులు తయారీపైన ప్రతి రైతు దృష్టి సారించాలన్నారు. జిల్లా నాబార్డు అభివృద్ధి మెనేజర్ రమేష్ కృష్ణ, మన్యం జిల్లా మెనేజర్ దినేష్ రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు భాగ్యలక్ష్మి, నీలవేణి, రైతులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

పొందూరు: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు జరగనున్న మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయ. పోటీలను ఎంఈఓలు రామరాజు, రాజారావు ప్రారంభించారు. మండలంలోని 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్ పోటీలలో మొదటి రోజు బాలురు పోటీ పడ్డారు. రెండో రోజు బాలికలు పోటీ పడనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికవుతారు. హెచ్ఎం వెంకటరావు పాల్గొన్నారు.

నరసన్నపేట: మండల స్థాయి ఆటల పోటీలను ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి బుధవారం ప్రారంభించారు. బాలురకు పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల నుంచి 450 మంది పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఎంఈఓ దాలినాయుడు, హెచ్ఎం హర్షవర్ధన్ శర్మ, ఆటల పోటీల కోఆర్డినేటర్ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: ఆటల పోటీల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు ఉన్నత చదువుల్లోనూ, ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు ప్రత్యేకంగా క్రీడాకారుల కోటా ఉంటుందని ఎంఈఓ చంద్రమౌళి, పాఠశాల హెచ్ఎం సింహాచలం అన్నారు. లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయి ఆటల పోటీలను బుధవారం ప్రారంభించారు. మండలంలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయలు పాల్గొన్నారు.